క్లుప్తంగా

జోరు వాన


పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

బెల్లంపల్లి/వేమనపల్లి: బెల్లంపల్లి, వేమనపల్లిలో జోరువాన కురిసింది. శనివారం మధ్యాహ్నం దాదాపు గంటకు పైగా ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు, మురికి నీటి కాలువల్లో వరద నీరు ప్రవహించింది. రోడ్లపై ఏర్పడిన గుంతల్లో, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. జనజీవనానికి విఘాతం కలిగింది.

చెట్టు కొమ్మలు తొలగించారు..!



సాక్షి ఎఫెక్ట్..

వేమనపల్లి: 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సబ్ ఇంజనీర్ ఆకాష్ ఆదేశాలతో లైన్‌ఇన్‌స్పెక్టర్ మార్కండేయ ఆధ్వర్యంలో ఎంచపాయ విద్యుత్ లైన్ వద్దకు వెళ్లారు. కొత్త విద్యుత్ లైన్ కావడంతో ఇంకా విద్యుత్ సరఫరా ఇవ్వలేదన్నారు. జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది మహేశ్‌లతో కలిసి విద్యుత్ లైన్‌పై ఉన్న కొమ్మలను తొలగించారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి గొడిశెల దశరథం కుమారుడు సాయిరాం స్మారకార్థం ఎమ్మార్పీఎస్ నాయకులు 20మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జీ మధుసూదన్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రక్తనిధి కేంద్రం వైద్యులు ప్రేంసాయి, సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న భోజన నిర్వాహకులు

దండేపల్లి: మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు దండేపల్లి ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎంఈవో మంత్రి రాజును కలిసి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాట్లాడుతూ.. 6నెలలుగా భోజన బిల్లులు రావడం లేదని, దీంతో కిరాణ దుకాణాల్లో ఖాతాలు పెరిగి పోతున్నాయని, పైగా కూరగాయలు తదిరాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బిల్లులు చెల్లించే వరకు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంటపనులు నిలిపి వేస్తామని స్పష్టం చేశారు. మండలంలోని ఉన్నత పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

సతీశ్‌కుమార్‌కు సన్మానం

చెన్నూర్: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కాలనీకి చెందిన కొమ్మెర సతీశ్‌కుమార్ ఇటీవల ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో ఎంపికైన సందర్భంగా వారి స్వగృహంలో పార్టీలకు అతీతంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దంపతులు అర్చన రామ్‌లాల్‌గిల్డా, బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు, నాయకులు పట్టణ ప్రముఖులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. సతీశ్‌కుమార్ రానున్న రోజుల్లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైక్రో ఫైనాన్స్ అధినేత పులి కిషోర్ కుమార్, బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్లు రెవెల్లి మహేష్, మేడ సురేష్ రెడ్డి, జగన్నాథుల శ్రీను, నడిపెల్లి లక్ష్మణ్ రావు, కాంగ్రెస్ నాయకులు పెద్దింటి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంచిర్యాలఅర్బన్: రాళ్లపేట్ రోడ్ నంబర్-1లో దుర్గామాత శోభాయాత్ర


కాసిపేట: సోమగూడెం చౌరస్తాలో...


మంచిర్యాలఅర్బన్: కోలాటాలు ఆడుతున్న మహిళలు


జైపూర్‌లో...

గంగమ్మ ఒడికి దుర్గమ్మ

జైపూర్/దండేపల్లి/రామకృష్ణాపూర్/కాసిపేట/మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): నవరాత్రులు ప్రత్యేక పూజలందుకున్న దుర్గామాత శనివారం గంగమ్మ ఒడికి చేరింది. చివరిరోజున దుర్గామాతకు ఘనమైన పూజలు చేసిన అనంతరం ప్రధానవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులతో పాటు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోలాటాలు ఆడుతూ డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ దేవీ విగ్రహాన్ని నిమజ్జనానికి సాగనంపారు. సమీప చెరువులు, వాగులు, గోదావరిలో నిమజ్జనం చేశారు.


లక్సెట్టిపేటలో దుర్గామాత వేషధారణలో....


మంచిర్యాలరూరల్(హాజీపూర్): కర్ణమామిడిలో...


రామకృష్ణాపూర్: రాజీవ్‌చౌక్‌లో...

దుర్వాసనతో అవస్థలు!

- జ్వరాల బారిన పడుతున్న కార్మిక కుటుంబాలు
- ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని సోమగూడెం భరత్‌కాలనీలోని కొన్ని వీధుల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక కంపు కొడుతుండటంతో పాటు జ్వరాల బారిన పడుతున్నట్లు కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భరత్‌కాలనీలోని క్వార్టర్ల నుంచి వచ్చే మురికి నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మురికి కాలువలు ఆనవాలు లేకుండా కూలిపోయాయి. దీంతో మురికి నీరు నిలిచి పందులు స్వైర విహారం చేస్తుండటంతో బురదమయంగా మారి దోమలకు ఆవాసంగా ఏర్పడుతున్నాయి. ఆ కాలనీలో ఇప్పటికే రెండు, మూడు కార్మిక కుటుంబాలు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడగా, ఒకరిద్దరు కార్మికులు జ్వరంతో హైదరాబాద్ ఆస్పత్రి వరకు వెళ్లివచ్చారు. దుర్వాసన, దోమలు, ఈగల బెడద తట్టుకోలేకపోతున్నామని, అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వెంటనే డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. కొన్ని ఏళ్లుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని, ఒక్కటి, రెండు కాలనీల్లో మాత్రమే నూతనంగా డ్రెయినేజీ నిర్మించి చేతులు దులుపేసుకున్నారనే విమర్శలున్నాయి. కార్మికుల సంక్షేమానికి పనిచేసే యాజమాన్యం, కార్మికుల కుటుంబాల్లో అనారోగ్యంతో ప్రాణాలు పోకముందే స్పందించి నిర్మాణాలు చేపట్టడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


డ్రెయినేజీ వ్యవస్థ చెడిపోయి నిలిచిన మురికినీరు

'మూఢ'బజార్లు..!

చంద్రమండలంపైకి రాకపోకలు సాగిస్తున్న ఈ రోజుల్లోనూ మూడు బజార్ల వద్ద భయానక పరిస్థితి నెలకొంటుంది. దృష్ట శక్తుల పేరిట నైవేద్యాలు సమర్పించడం భయాందోళనకు గురిచేస్తోంది. ఇంట్లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే చాలు ఏ దృష్ట శక్తో పట్టి పీడిస్తుందని, వాటికి నైవేద్యం సమర్పిస్తే నయమవుతుందనే మూఢ నమ్మకాలతో ఆయా ప్రధాన చౌరాస్తాల్లో విస్తరాకుల్లో నిమ్మకాయ, కోడిగుడ్లు, గారెలు, బూరెలు, తదితర పిండి వంటకాలు, మద్యం ఉంచుతున్నారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా ఈ తతంగం నడుస్తోంది. రాత్రిళ్లు బయటకు వెళ్తున్న వారు చూసి భయాందోళనకు గురువుతున్నారు. ఆదివారం అమావాస్య రోజు మరీ ఎక్కువగా ఉంటున్నాయి.


బెల్లంపల్లి శాంతిఖని వద్ద...

\- మంచిర్యాలఅగ్రికల్చర్

సమాచారం

నేడు పుస్తకావిష్కరణ

నస్పూర్: తమిళనాడులోని మనుజ్యోతి ఆశ్రమ ఆధ్వర్యంలో శ్రీమన్నారాయణ శ్రీ లహరి కృష్ణ రచించిన అమృత మంజరి భాగం-2 పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం 4గంటలకు ఆవిష్కరించనున్నట్లు మనుజ్యోతి ఆశ్రమం తెలంగాణ ప్రతినిధులు వివేకనంద, రాజయ్య తెలిపారు. నస్పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో కార్యక్రమం నిర్వహించనుండగా, పెద్దపల్లికి చెందిన భగవద్గీత అంతరార్థ ప్రబోధిక్ ఆవుల ముత్తయ్య, శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, డీజీఎం రవికుమార్ పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో ఆశ్రమ సభ్యులు కలవేణ సమ్మయ్య, జన్న తిరుపతి, రవికుమార్, రాములు, హరినాథ్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బెల్లంపల్లిలో వాక్‌థాన్

బెల్లంపల్లి: ఆరోగ్యం, ఆనందం, ఐక్యత కోసం బెల్లంపల్లిలో ఆదివారం వాక్‌థాన్ (రన్) నిర్వహిస్తున్నట్లు మార్వాడీ యువమంచ్ పట్టణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అఖిల భారత మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సింగరేణి తిలక్‌స్టేడియం నుంచి ఏఎంసీ క్రీడా మైదానం వరకు వాక్‌థాన్ జరుగుతుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా ఒకేరోజు 850శాఖల్లో, విదేశాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి టీషర్ట్ అందజేయనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రమాదం జరగకముందే పట్టించుకోండి!



వేమనపల్లి: మంగనపల్లి నుంచి నాగారం వెళ్లే రహదారిపై ఎండిపోయిన నారేపచెట్టు ప్రమాదకరంగా ఉంది. కొమ్మలు పుచ్చుపట్టి రోడ్డుపై పడుతున్నాయి. కొమ్మలు మీద పడి ప్రమాదం చోటు చేసుకోక ముందే చెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌తో మైత్రి'

పాతమంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ పార్టీ పనిచేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గం తీర్మానం చేసిందన్నారు. అనంతరం సీపీఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన కలవేన శంకర్‌ను సీపీఐ జిల్లా సమితి నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ, ఇప్పకాయల లింగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

వన్యప్రాణులతోనే జీవరాసి మనుగడ

వేమనపల్లి: అడవిలో వన్యప్రాణులు సురక్షితంగా ఉంటేనే మానవుడితో పాటు జీవుల మనుగడ సాఫీగా ఉంటుందని నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హఫీజోద్దీన్ అన్నారు. వన్యప్రాణుల సప్తాహ్ వారోత్సవాలను పురస్కరించుకొని నీల్వాయి, కొత్తగూడెం కాలనీల్లో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్యప్రాణుల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర, అనేక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అటవీ రేంజ్ అధికారి

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

దండేపల్లి: స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ సూచించారు. దండేపల్లి మండలం ముత్యంపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ఎలా పనిచేయాలి, ఏం చేయాలి అనే దానిపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేసి, స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిగౌడ్, సంతోష్, జిల్లా నాయకులు ముఖేష్‌గౌడ్, శ్రీనివాస్, ప్రభాకర్, రాజయ్య, నరేష్, అనిల్, మహేష్ పాల్గొన్నారు.


దండేపల్లి: మాట్లాడుతున్న రఘునాథ్

నీటి ఇబ్బందులు తీర్చరూ..!


పాతమంచిర్యాలలో పనిచేయని చేతిపంపు


పనిచేయని బోరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధి పాతమంచిర్యాలలోని ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఏర్పాటు చేసిన ఓ చేతి పంపు, బోరు పనిచేయడం లేదు. ఎస్సీ కాలనీలో గల ప్రజలకు ఇంటి అవసరాలకు వినియోగించుకునేందుకు వేసిన ఒక చేతిపంపు, ఒక బోర్‌వెల్ రెండు కూడా పనిచేయకపోవడంతో, తాగునీటి నల్లాపైనే ఆయా కాలనీ ప్రజలు ఆధారపడాల్సి వస్తోంది. ఒక్క రోజు తాగునీటి నల్లా రాకపోయినా, ఆ రోజుకు ఇతరత్ర పనులకు గాను అవసరమైన నీటికి తిప్పలు తప్పడం లేదు. చిన్నచిన్న పనులతో పాటు, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ కాలనీ వాసులకు నీటి కష్టాలతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. వెంటనే అధికారులు వాటికి మరమ్మతు చేపట్టి, బాగు చేయాలని కోరుతున్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్షయ వ్యాధి గ్రస్తులకు బ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహార కిట్లు అందించారు. వీటిని క్షయ జిల్లా ప్రోగ్రాం అధికారి సుధాకర్‌నాయక్ పంపిణీ చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు నివారణకు సంబంధించిన మందులతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తాళ్లపేట పీహెచ్‌సీ వైద్యుడు క్రాంతికుమార్, టీబీ సూపర్‌వైజర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మెజార్టీ స్థానాలు గెలిపించుకోవాలి

భీమారం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చెందిన వారిని పెద్ద ఎత్తున గెలిపించుకోవాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను ఆయన కొనియాడారు. ఇందులో మండల నాయకులు పోటు రాజేశ్వర్‌రెడ్డి, గుడిమల్ల వెంకటేశ్, వేముల శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

సీఈఆర్ క్లబ్‌లో ఖాదీమేళా

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో శనివారం ఖాదీమేళాను ఏరియా ఎస్వోటు జీఎం విజయప్రసాద్, పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11వరకు మేళా ఉంటుందన్నారు. సింగరేణి ఉద్యోగులకు రూ.20వేల వరకు వస్త్రములపై క్రెడిట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఖాదీ వస్త్రాలపై, పోలీ వస్త్రాలపై 30శాతం, కోసా సిల్కు, ఉలన్ వస్త్రాలపై 20శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. ఈ మేళాలో అన్ని రకాల వస్త్రములు, టవల్స్, చెద్దర్లు, బెడ్‌షీట్స్, లుంగీలు, స్టార్ కార్పెట్స్, తదితర వస్త్రాలతో పాటు స్వచ్ఛమైన తేనె, కుటీర్ సోప్స్, అగరువత్తులు, జీవశక్తి టానిక్, షుగర్ తగ్గుటకు స్టేవియా పౌడర్ లభించునని అన్నారు. అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న ఎస్వోటు జీఎం, ఏరియా పీఎం శ్యామ్‌సుందర్

కేకే–ఓసీ ఉద్యోగులకు బహుమతులు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే-ఉపరితల గని(ఓసీ)లో కోల్ ప్రొడక్షన్, మెయింటనెన్స్ విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను శనివారం గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ ఘనంగా సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ఓసీలో ఓబీ, బొగ్గును డిపార్ట్‌మెంటల్ యంత్రాల ద్వారా ఉద్యోగులు ఉత్పత్తి చేయడం అభినందనీయమన్నారు. ఉద్యోగులు బొగ్గు ఉత్పత్తి పెంపుతో పాటు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మలయ్య, మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకటవంశీధర్, యూనియన్‌ల ప్రతినిధులు ఉద్యోగులు ఉన్నారు.

బొగ్గుబాయి వార్తలు

'ఐఎన్‌టీయూసీతోనే హక్కుల సాధన'

శ్రీరాంపూర్: కార్మికుల హక్కులు ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని ఆ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 7గనిపై యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులకు హక్కులు సాధించిన చరిత్ర ఐఎన్‌టీయూసీకి మాత్రమే ఉందన్నారు. నేడు తమ యూనియన్ సెక్రెటరీ జనరల్ బీ. జనక్ ప్రసాద్ నేతృత్వంలో కార్మికుల పెండింగ్ డిమాండ్ల సాధన కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్మికులకు లాభాల వాటా పెంచి ఇవ్వడంలో తమ యూనియన్ కృషి ఉందన్నారు. కార్మికులు ఎంతో ఉత్సాహంగా సభ్యత్వాన్ని నమోదు చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర నాయకులు గరిగే స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవిందర్‌రెడ్డి, పేరం రమేశ్, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

భీమిని: మండలంలోని చెన్నపూర్ గ్రామంలోని పలువురు వృద్ధులకు శనివారం ఎస్సై విజయ్‌కుమార్ 15కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. కానిస్టేబుళ్లు జంబోజు లక్ష్మణాచారి, దీపిక పాల్గొన్నారు.